ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు
5★★
సోమవారం 2 సెప్టెంబరు 2024


● బొమ్మెన ప్రాజెక్ట్‌కు జలకళ

కథలాపూర్: పలు గ్రామాలకు వరప్రదాయినిగా ఉన్న బొమ్మెన ప్రాజెక్ట్‌కు ఎట్టకేలకు జలకళ పట్టింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అంబారిపేట, పోతారం, ఇప్పపల్లి అడవుల్లోంచి విపరీతంగా వరద వచ్చి చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకుని మత్తడి పొంగి పొర్లుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌కు జలయోగం పట్టిన క్రమంలో ఆయకట్టుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

దంచికొట్టిన వాన

- రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం
- చెరువులు, కుంటలల్లోకి వర్షపు నీరు
- లో లెవల్ కల్వర్టులపై నుంచి ప్రవాహం
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- ముందస్తు చర్యల్లో కలెక్టర్, ఎస్పీ


కోరుట్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెండో రోజు ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో గోదావరి, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వరద నీరు భారీగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు మండలాలు, పట్టణాల్లో పాత ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పంట చేలల్లోకి వర్షపు నీరు చేరాయి. చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు తీసుకోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంతో పాటు, జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో ఆదివారం భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరుచేరి ఇళ్లలోకి ప్రవహించింది. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, జాబితాపూర్, మోతె, పెర్కపల్లి, హన్మాజీపేట బ్రిడ్జిలు నీటమునిగాయి. అనంతారం బ్రిడ్జి పైనుంచి నీరు పారుతుండడంతో జగిత్యాల, ధర్మపురి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల పట్టణంలోని తులసీనగర్, టవర్ ప్రాంతం, మార్కండేయ నగర్, విద్యానగర్, బీట్‌చౌరస్తా, గోవిందుపల్లి వెంకటాద్రినగర్, తహసీల్‌చౌరస్తా, జంబిగద్దె ప్రాంతాలు పూర్తిగా జలమయవడంతో ఇళ్లలోకి నీరుచేరింది. జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ రాంమోహన్ పరిశీలించారు.

● జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో గల వెంకటాద్రినగర్ జలమయమైంది. లోతట్టు ప్రాంతం కావడంతో ఆదివారం కురిసిన వర్షానికి వెంకటాద్రినగర్ వెళ్లే బ్రిడ్జి పూర్తిగా నీటమునిగింది. దీంతో కాలనీకి రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్పీ అశోక్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి పరిశీలించారు.

● **మేడిపెల్లి:** మండలంలోని కొండాపూర్ ఊర చెరువు మత్తడిని కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించి పరిశీలించారు. కొండాపూర్ ఊర చెరువు నిండి మత్తడి రోడ్డుపై నుంచి పారడంతో విలయతాబాద్-కొండాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రహదారికి అడ్డంగా ట్రాక్టర్లను పెట్టి రాకపోకలు నిలిపివేశారు. ఆదివారం కలెక్టర్ సందర్శించి అధికారులకు సూచనలు చేశారు.

రాయికల్: పట్టణంలోని ఏడో వార్డులో మురికి కాలువలు నిండి నీరు రోడ్లపై ప్రవహించింది. రాయికల్ మండలం ఆలూరు-అయోధ్య గ్రామాల మధ్య రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో వరినాట్లు వేయడానికి వెళ్లిన కూలీలు చిక్కుకోగా ట్రాక్టర్ ద్వారా తరలించారు. మండలంలోని మైతాపూర్, ఇటిక్యాల, మూటపెల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాలను, రాయికల్ పెద్ద చెరువును అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, ఇరిగేషన్ డీఈ భాస్కర్, పీఆర్ ఏఈ ప్రసాద్, ఆర్ఐ పద్మయ్య ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలో భారీ వర్షం కుస్తుండడంతో పలు గ్రామాల్లోని రోడ్లు కొట్టుకుపోగా, పంట పొలాలు నీట మునిగాయి, లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. మండలంలోని అల్లూరిసీతారామరాజు తండా శివారులోని కల్వర్టుపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కోంద్రికర్ల గ్రామ శివారులోని వాగుపై ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. వెల్లుల్ల అనుబంధ గ్రామమైన మాసాయిపేట శివారులోని కల్వర్టు పైనుంచి వర్షపు నీరు పారుతూ పంటపొలాలకు నీరు చేరింది. దీంతో పంటపొలాలకు వెళ్లకుండా పంచాయతీ కార్యదర్శి నారాయణ రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేయించారు. ఆర్డీవో శ్రీనివాస్ పలుగ్రామాల్లో పర్యటించారు. జాగ్రత్తలను అధికారులకు సూచించారు.

మల్యాల: మండలంలోని ఓగులాపూర్‌లో కుమ్మరికుంట చెరువు నిండి సమీపంలోని అయిదిళ్లలో నీరు చేరుకున్నాయి. తాళ్లకుంట చెరువు నిండి ప్రమాదకరంగా మారింది. గొర్రెగుండంలో గుట్టల నుంచి వచ్చిన నీరు గ్రామంలోని హనుమాన్ ఆలయాన్ని తాకుతూ ప్రవహించింది. కల్వర్టుల్లో చెట్ల కొమ్మలతో రహదారులపై నుంచి వర్షపు నీరు ప్రవహించాయి. గ్రామస్తులు జేసీబీతో వాటిని తొలగించారు. రామన్నపేట-నూకపల్లి గ్రామాల మధ్య రహదారిపై నీరు వెళ్లగా పోలీసులు ఎక్స్‌కవేటర్‌తో కాలువలు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. మల్యాల-పెగడపల్లి మార్గంలో రదాదారి తెగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్సై నరేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి పరిశీలించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

● మండలంలోని ఓగులాపూర్‌లో అయిదు ఇళ్లల్లోకి నీరు రావడంతో అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు సూచించారు. గ్రామాల్లో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్, ఎస్సై నరేశ్, ఆర్ఐ తిరుపతి తదితరులు పర్యవేక్షించారు.

కొడిమ్యాల: మండలంలోని కోనాపూర్ గ్రామ చెరువు నిండి మత్తడి దూకటంతో కోనాపూర్ వాగు, పోతారం చెరువు సమీపంలోని బుగ్గవాగు పారుతోంది. దీంతో కోనాపూర్ గ్రామానికి రాకపోకలు నిలిచాయి. పోతారం చెరువు మత్తడి దూకటంతో కొడిమ్యాల పెద్దవాగు పారుతోంది. పారుతున్న వాగులను పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈఈ చంద్రశేఖర్, మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల తహసీల్దారు టి రాజమణి, ఎంపీడీవో స్వరూప పరిశీలించారు. నూరంపేట నుంచి గంగారాంతండాలోకి వెళ్లే బ్రిడ్జ్‌పై నుంచి వర్షపు నీరు పారటంతో అధికారులు ఎక్స్‌కవేటర్ సహాయంతో చెత్తను తొలిగించారు. తిర్మాలాపూర్ గ్రామ శివారులోని సంద్రల్లప ల్లి బ్రిడ్జ్‌పైనుంచి వాగు పారుతోంది.

కథలాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనం అతలాకుతలం అవుతోంది. అడవుల్లోంచి పుష్కలంగా వస్తున్న వరద కారణంగా మండలంలోని తాండ్ర్యాల-ఇప్పపల్లి మధ్య వేములవాడ-కోరుట్ల రహదారి తెగిపోయింది. కల్వర్టులో చెత్తాచెదారం పేరుకోవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహించి కోతకు గురైంది. దీంతో వేములవాడ-కోరుట్ల మధ్య రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న ఎస్సై నవీన్, రెవెన్యూ అధికారులు ఎక్స్‌కావేటర్‌తో చెత్తను తొలగించారు. రాకపోకలను పునరుద్ధరించారు. ఇప్పపల్లి- పోతారం గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగిపొర్లింది. తుర్తి-అంబారిపేట మధ్య ఉన్న ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో తుర్తి వాసులు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండిపోయారు. భూషణరావుపేటలో వంగ కళ అనే మహిళ ఇంట్లోకి నీరు చేరి నిత్యావసర వస్తువులన్నీ తడిసిపోయాయి.

బీర్‌పూర్: కడెం ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయడంతో ఆదివారం బీర్‌పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ కమ్మునూర్ బ్రిడ్జి వద్ద నది ప్రవాహన్ని పరిశీలించి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

● **మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం):** పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమలమయ్యాయి. డ్రైనేజీలు పొంగి పోర్లి రోడ్లపై ప్రవహిస్తుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో రోడ్లపై నిలిచిన వర్షం నీటిని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు.

● **ఇబ్రహీంపట్నం:** మండలంలోని వర్షకొండ, ఫకీర్ కొండపూర్‌తో పాటు అయా గ్రామాల్లోని చెరువులు మత్తడి దూకుతున్నాయి. వర్షకొండ-ఇబ్రహీంపట్నం, యామపూర్-ఫకీర్‌కొండపూర్ గ్రామాల మధ్య రొడ్యాంలు రహదారిపై ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఆయా గ్రామాల్లో రోడ్యాంలను పరిశీలించారు. ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూం 9948921613, 9949656224 నంబర్లను సంప్రదించాలని అయన తెలిపారు.

పెగడపల్లి: మండలానికి నాలుగు పక్కల రాక పోకలు నిలిచిపోయాయి. పెగడపల్లి మల్యాల రహదారిలో ఆరవెల్లి బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుండగా రాకపోకలు నిలిచిపోయాయి. పెగడపల్లి-గంగాధర మార్గంలో లక్ష్మీదేవిపల్లి వద్ద బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటం, మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని మద్దుల, తాళ్ల చెరువు పూర్తిగా నిండి మత్తడి దూకుతున్నాయి. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, అయిలాపూర్ రోడ్డు, కల్లూర్ రోడ్డు, అనందగిరీనగర్, ముత్యాలవాడ, రతాల పంపు, రాంనగర్, బిలాల్‌పుర, పాంత్రాల్లో వర్షం నీరు రోడ్డు ప్రవహిస్తోంది. పట్టణ శివారులోని గంగంపేట, అంబేడ్కర్ నగర్ వాగు పరివాహక ప్రాంతంలో వాగు ఉధృతంగా ప్రవహించి ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు. కల్లూర్ రోడ్డులోని రైల్వే వంతెన వద్ద రోడ్డుపై నీరు ప్రవహించండతో కల్లూర్ గ్రామంతో పాటు అనంద గిరి నగర్ వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని ప్రకాశం రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో కలెక్టర్ సత్యప్రసాద్ పర్యటించారు. లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్డీవో అనంద్ కుమార్, తహసీల్దార్ కిషన్, కమిషనర్ తిరుపతి, ఆర్ఐ రాజేందర్ రావు, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.


ట్రాక్టర్‌పై వాగు దాటుతున్న కోనాపూర్ గ్రామస్థులు

వెల్గటూర్: మండలంలో కురుస్తున్న వర్షానికి చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరడంతో నిండు కుండలా కనిపిస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. కడెం ప్రాజెక్ట్ నీటితోపాటు, పెద్దవాగు నీరు కూడా గోదావరిలో చేరడంతో గోదావరి నిండుకుండలా మారింది. తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని వంతెనపై వాగు ఉద్రిక్తంగా ప్రవహించండంతో పైడిమడుగు, రాయికల్, సర్పరాజుపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాదాపూర్ నుంచి చిన్న మెట్‌పల్లి గ్రామాలకు వెళ్లే రహదారిపై భారీగా నీరు ప్రవహించండతో కొంత సేపు రాకపోకలను నిలిపివేశారు. మండలంలోని కల్లూర్ శివారులోని వంతెనను డీఎల్‌పీవో రఘువరన్ పరిశీలించారు. తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

భీమారం: మండలంలోని మన్నెగూడెంలో లోతట్టు ప్రాంతాలు జలమమమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో వాగులు పొంగి పొర్ల డంతో కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం మండలంలోని కమ్మరిపేటలో పర్యటించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మన్నె గూడెం నుంచి కోరుట్ల వెళ్లే రోడ్డు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బాగోతుల వాడకు, గ్రామానికి మధ్యలో రోడ్డుపై నీరు పారడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. గ్రామపంచాయతీ, కూరగాయల మార్కెట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోడ్డుకు ఇవతల ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భీమారం-దేశాయిపేట రోడ్డులో ఉన్న కల్వర్టు వద్ద నీరు ప్రవ హించడంతో మట్టి కొట్టుకుపోయింది. భీమారంలోని ఎస్సీ కాలనీ, దేశాయిపేటలోని సరస్వతి కాలనీలో భారీ వర్షానికి మురికి కాలువలు పొంగడంతో ఇళ్లల్లోకి నీరు చేరింది.

గొల్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పత్తి చేన్లలోకి వరద నీరు చేరడంతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల వసతి గృహం సమీపంలోకి వరద నీరు రావడంతో తహసీల్దార్ జమీర్ అక్కడికి చేరుకొని తహసీల్దార్ పక్కనే ఉన్న ఊర చెరువును పరిశీలించారు. మండల కేంద్రంలో ఒక ఇంట్లోకి వర్షం నీరు చేరడంతో అందులో ఒంటరిగా నివాసముంటున్న వృద్ధురాలిని తహసీల్దార్ బంధువుల ఇంటికి పంపించారు. ఎస్సై సతీష్ కుమార్ వెనుగుమట్ల, బొంకూర్ గ్రామాల్లోని సదాజల వాగును పరిశీలించారు.

జిల్లావ్యాప్తంగా 59.41 మిల్లీమీటర్ల వర్షం..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సగటున 59.41 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా ధర్మపురి మండలం నేరేళ్లలో 90.3 మిల్లీమీటర్లు, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 87.5 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా ఎండపల్లి మండలం మారేడుపల్లిలో 10.8 మిల్లీ మీటర్లు, మల్యాల మండలం మద్దుట్లలో 20.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మేడిపల్లిలో 85.0 మిల్లీ మీటర్లు, జగిత్యాల మండలం పొలాసాలో 84.3, ధర్మపురి మండలం బుద్దేశుపల్లి 82.5, బీమారం మండలం మన్నెగూడెంలో 82.0, మెట్‌పల్లిలో 81.0, పెగడపల్లిలో 78.0, జగిత్యాలలో 75.3, కథలాపూర్ 73.3, మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో 71.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అదేవిదంగా కోరుట్లలో 71.3 మిల్లీ మీటర్లు, ఎండపల్లిలో 68.3, ధర్మపురి మండలం జైనాలో 67.0, గొల్లపల్లిలో 65.0, రాయికల్‌లో 64.8, బీమారం మండలం గోవిందారాంలో 63.5, మల్యాలలో 57.3, బుగ్గారం మండలం సిరికొండలో 56.5, మల్లాపూర్ మండలం రాఘవపేటలో 56.0, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 55.3, సారంగపూర్, కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ లో 55.0, ఎండపల్లి మండలం గుల్లకోటలో 54.3, మల్లాపూర్‌లో 52.8, కొడిమ్యాల మండలం పూడూరులో 48.3, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 45.5, వెల్గటూరులో 40.3, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 21.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

మత్తడి దూకుతున్న ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ చెరువు


ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలన


వాగును పరిశీలించడానికి ట్రాక్టర్‌లో వెళ్తున్న ఎమ్మెల్యే

కొడిమ్యాల: మండలంలో రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు కోనాపూర్ వాగు పారటంతో కోనాపూర్‌కు రాకపోకలు నిలిచి పోయాయి. సమాచారం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కోనాపూర్, సంద్రల్లపల్లి బ్రిడ్జ్‌ల నిర్మాణం పూర్తి చేయిస్తానన్నారు. సంబంధిత పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో మాట్లాడారు. మారుమూల గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చేస్తానన్నారు. మండలంలోని దమ్మయ్యపేట బుగ్గ వాగు నుంచి కోనాపూర్ వాగు వరకు ట్రాక్టర్‌లో వెళ్లారు. ఎమ్మెల్యే వెంట అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, తహసీల్దారు బి. రాజమణి, ఎంపీ డీవో స్వరూప, ఎంపీవో వాసవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాలో వివిధశాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు వరదనీటి ఉధృతిని అంచనావేయకుండా నదులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంబాల సమీపంలోకి వెళ్లవద్దని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.


అనంతారంలో నీటి ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్


మేడిపల్లి మండలం కొండాపూర్ ఊర చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్


ఏఎస్ఆర్‌తండా శివారులో కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న నీరు


మల్యాల మండలం గొర్రెగుండంలో ఆలయం వద్దకు చేరిన నీరు


జగిత్యాల-లింగంపేట దారిపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు


మత్తడి దూకుతున్న పోతారం చెరువు


పెగడపల్లి మండలం ఆరవెల్లిలో బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న వరద


భీమారం మండలం మన్నెగూడెంలో రోడ్డుపై పారుతున్న నీరు

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF SURNAME

★ I, RUDRARAM KANAKALAXMI W/O. RUDRARAM LAXMAIAH, R/O. H.NO: 4-149, VELDI, MANAKONDUR, KARIMNAGAR, HAVE CHANGED MY SURNAME AS "RUDRAVARAM KANAKALAXMI W/O. RUDRAVARAM LAXMAIAH.

AJK-15869

CHANGE OF SURNAME

★ I, RUDRARAM LAXMAIAH S/O. RUDRARAM PEDDAIAH, R/O. H.NO: 4-149, VELDI, MANAKONDUR, KARIMNAGAR, HAVE CHANGED MY SURNAME AS "RUDRAVARAM LAXMAIAH S/O."RUDRAVARAM PEDDAIAH.

AJK-15869

CHANGE OF NAME

★ I, BIGULLA BABAIAH, S/O. KOMURAIAH. R/O. H.NO. 2-84, KALLEPALLY, BEJANKI, SIDDIPET. HAVE CHANGED MY NAME AS " BIGULLA BABU ", S/O. BIGULLA KOMURAIAH.

AJK-15868

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా సమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640

జగిత్యాల :- సెల్ : 9985411262

మెట్‌పల్లి :- సెల్ : 7013142966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్ : 9985411063

పెద్దపల్లి :- 9550900238



హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 1: హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆదివారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. అమలుకు నోచుకోని హామీలనిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఏ గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగిందా చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దమ్ముంటే ధరణిని రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జ్వరంతో మహిళ మృతి


శ్రీలత(ఫైల్)

ముత్తారం, సెప్టెంబరు 1: మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీలత (45) జ్వరంతో మృతిచెందింది. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న శ్రీలతను హను మకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెం దినట్లు భర్త శ్రీనివాస్ తెలిపారు. ఆమెకు భర్త, కొడుకు కూతురు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు..

రామగిరి, సెప్టెంబరు 1: మండలంలోని రాజాపూర్ గ్రామంలో విద్యుదాఘతంతో అంకం రాజమ్మ(65) అనే వృద్ధురాలు మృతిచెందింది. ఆదివారం ఉదయం 9.00 గంటల ప్రాంతంలో ఇంటి ఎదుట రేకుల షెడ్డులో బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి పెద్దకొడుకు సదానందం ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: మనీ యాప్‌లు వేధించడంతో కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన తుండ్ల శ్రీనివాస్(30) ఇటీవల పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్ అవివాహితుడు.

ఇద్దరిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, సెప్టెంబరు 1: చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో ఆది వారం ఇద్దరు వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బద్దం మల్లారెడ్డి, మధు బస్టాండ్ వద్ద ఉన్నారు. అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క ఇద్దరిపై దాడి చేసి గాయపరిచింది. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, సెప్టెంబరు 1: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి గౌడ శంకర్ (54) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గౌడ శంకర్ ఒంటరి జీవితం గడపడమే కాకుండా అనారోగ్యానికి గురి అయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పట్టివేత


భగత్‌నగర్, సెప్టెంబర్ 1: కరీంనగర్-2 డిపో బస్సు నెం.టిఎస్ 02 యుసి6250లో కండక్టర్ బ్యాగును దొంగిలించిన బి.రమేష్ అనే వ్యక్తిని ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది బస్‌స్టేషన్‌లో పట్టుకుని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ లక్‌పతి, సెక్యూరిటీ గార్డ్ జి కవిత, ఆన్‌డ్యూటీ కంట్రోలర్ ఐసిఎస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.













ప్రాజెక్టులకు జలకళ

ఉమ్మడి జిల్లాలో శనివారం రాత్రి నుంచి జోరు వర్షం కురిసింది. దీంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువులు, కుంటలు మత్తడి పడుతున్నాయి. వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద నీరు


జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 83,636 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 64.768టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,325 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

● **వరద కాలువకు నీటి విడుదల..**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆదివారం సాయంత్రం వరద కాలువకు నీటిని వదిలారు. హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి వరద కాలువ దిగువకు 1,500 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. కాగా నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోందని, గోదావరి నదీ పరిసరాల ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సారెస్పీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా చేపలు పట్టేవారు, రైతులు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని కోరారు. అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మిడ్ మానేరుకు వరద ఉధృతి

బోయినపల్లి, సెప్టెంబరు 1: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 46,891 క్యూసెక్కుల నీరు చేరుతోంది. 6,550 క్యూసెక్కుల నీటిని బయటకు వదలుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 16.215 టీఎంసీల మేరకు ఉంది. కాగా తుఫాన్ ప్రభావం వల్ల ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో పెరిగితే ఎల్ఎండీ ప్రాజెక్టుకు నీటి విడుదలను పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు కింద ఉన్న మానేరు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


మిడ్ మానేరు ప్రాజెక్ట్

ఎల్ఎండీకి పెరిగిన ఇన్‌ఫ్లో


నీటితో కళకళలాడుతున్న దిగువ మానేరు జలాశయం

తిమ్మాపూర్, సెప్టెంబరు1: ఎడతేరపి లేకుండా కురుస్తున్న భారి వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. శనివారం రాత్రి 9గంటల సమయం వరకు ఎల్ఎండిలోని మోయతుమ్మెద వాగు నుండి కేవలం 1100 క్యూసెక్కు. నీరు రాగా, ఆదివారం ఉదయం 6గంటల సమయంలో 2,716 క్యూసెక్కులకు, 9గంటలకు 12,206క్యూసెక్కులకు, మధ్యాహ్నం 2గంటల ప్రాంతములో 15,595, 3గంటలకు 29,879, సాయం త్రం 5గంటలకు 39,047 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి తొమ్మిదిగంటలకు 15,937 క్యూసెక్కులకు తగ్గింది. ప్రా జె క్టులోకి మొత్తం ఇన్‌ఫ్లో 18,320 క్యూసెక్కులు ఉంది. ఎల్ ఎండీ పూర్తి స్థాయి స్థామర్థ్యం 24.034 టీఎంసీలకు కాగా ప్ర స్తుతం 14.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను అధికా రులు నిలిపివేశారు.


ఎల్లంపల్లి నుంచి దిగువ గోదావరిలోకి వదులుతున్న నీరు

శ్రీపాద ఎల్లంపల్లి గేట్లు ఎత్తిన అధికారులు

పెద్దపల్లి/ధర్మారం/అంతర్గాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఆదివారం తెల్లవారుజాము వరకు పెద్ద ఎత్తున వరద నీరొచ్చి చేరింది. క్యాచ్ మెంట్ ఏరియా, కడెం ప్రాజెక్టు నుంచి 1,15,074క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా,20 గేట్లు ఎత్తి 1,15,074 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతు న్నారు. దీంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. వరద ప్రవాహాన్ని బట్టి నీటిపారుదల శాఖ అధికారులు గేట్లు ఎత్తుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20. 175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17,813 టీఎంసీల నీరు ఉంది. గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు నిషేదాజ్ఞలు జారీ చేశారు.

ధర్మపురి వద్ద ప్రమాద స్థాయిలో గోదావరి వరద


ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, సెప్టెంబరు 1: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆదివారం సాయంత్రం ప్రమాద స్థాయికి చేరింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. ఉదయం ఏడు గంటల వరకు ప్రాజెక్టు లోనికి 65,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 10 గేట్లు తెరచి 79,166 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి అధికారులు విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు కడెం ప్రాజెక్టులోకి 32,168 ఇన్‌ఫ్లో కొనసాగడం వల్ల కొంత మేరకు నీరు తగ్గించారు. దిగువ గోదావరి నదిలోకి 18,522 క్యూసెక్కులు విడుదల చేశారు. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగద్దె, మంచి నీటి బావి నీటిలో మునిగిపోయింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తం చేశారు. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, గోదావరి వరద వల్ల ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తగా ఉండాలన్నారు. . కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో
అధికారులు అప్రమత్తంగా ఉండాలి

▸▸ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి ▸▸ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాల నేప థ్యంలో ఆదివారం ఉదయం కరీంనగర్ కార్యాల యం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తూ అప్రమత్తం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యా దులకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అక్కడి నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు పంపించాలన్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలుంటాయన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా స త్పతి, జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ ప్రాజెక్టుల నీటి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సంజిత్‌కు మార్ ఝూ, ఎస్పీ అఖిలేష్ మహాజన్‌తో ఎప్పటి కప్పుడు సమీక్షించారు. మిడ్‌మానేరుకు వస్తున్న వరద, ఎగువ మానేరు పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎంజేపీ గురుకులంలో విద్యార్థుల ఆందోళన
-మాడిన అన్నం పెట్టారని సాయంత్రం వరకు పస్తులు
-ప్రిన్సిపాల్ ఆదేశాలతో మళ్లీ వండిపెట్టిన నిర్వాహకులు

సైదాపూర్, సెప్టెంబరు 1: సైదాపూర్ మహాత్మాజ్యోతిరావు పూలే (బాలుర) గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం మాడిన అన్నం పెట్టారని విద్యార్థులు ఆందోళన చేశారు. ఆదివారం అన్నం మెత్తగా వండడంతో పాటు మాడిపోవడంతో విద్యార్థులు అన్నం తినకుండా సాయంత్రం వరకు ఉన్నారు. 9,10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఆందోళన చేయడంతో ప్రిన్సిపాల్ ఆదేశాలతో వంటల నిర్వాహకులు మళ్లీ అన్నం వండి పెట్టారు. దాంతో సాయంత్రం అన్నం తినాల్సి వచ్చిందని విద్యార్థులు తెలిపారు. దీనిపై సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా మూడు గంజుల్లో అన్నం వండగా ఒక గంజులో మాడిపోయిన మాట వాస్తవమేనన్నారు. వంటవారిని మందలించి మళ్లీ వండి విద్యార్థులకు పెట్టామన్నారు. చాలా రోజుల నుంచి గిన్నెలు కారుతున్నాయని వంటవారు చెప్పారని, ఆ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూస్తామని తెలిపారు. కాగా సైదాపూర్‌లో సరైన భవనం లేకపోవడంతో సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాలను హుజూ రాబాద్‌లోని బోర్నపల్లి వద్ద బిల్డింగ్ కిరాయికి తీసుకొని నిర్వహిస్తున్నారు. ఆ బిల్డింగ్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, వెంటనే నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి


యూఎస్ఎఫ్ఐలో చేరిన వారికి కండువా కప్పుతున్న నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1: ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంద గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నప్పటికీ పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమని మండి పడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమిం చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తామని చెప్పి హామీలను విస్మరించారన్నారు. తక్షణమే ప్రభుత్వ విద్యాలయా లను సందర్శించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం ఉత్తర తెలంగాణకు సంబంధించిన వివిధ విద్యార్థి సంఘం నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన నాయకులు యుఎస్ఎఫ్ఐ సంఘంలో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా మాజీ నాయకుడు రామగల సురేష్ చేరారు. కరీంనగర్ జిల్లాలో ఉమామహేశ్వర్, మయూరి, అక్షయలతో పాటు ఇతరులు చేరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బి తిరుపతి కుమార్. జిల్లా నాయకులు సంతోష్, మల్లికార్జున, సతీష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం


పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూరులో ఇంట్లోకి వెళ్లిన వర్షపు నీరు


వరదలో నిండిపోయిన ఫైవింక్లయిన్ రహదారి


కోరుట్లలోని ప్రకాశం రోడ్డులో నిలిచిన వరదనీరు


సైదాపూర్‌లో లోలెవల్ వంతెనపై చిక్కుకున్న ఆటోను తీస్తున్న ప్రజలు


అలుగు పారుతున్న కొత్తపల్లి చెరువు


చిగురుమామిడి మండలంలో ఇంట్లోకి చేరిన వరదనీరు


మత్తడి దూకుతున్న సర్వాయిపేట కొచ్చెరువు

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	83.636	2.325	80.5	64.768
ఎల్లంపల్లి	1,15.074	1.15.074	20.175	17.813
మిడ్ మానేరు	46,891	6.550	27.54	16.215
ఎల్ఎండీ	18.320	267	24.034	14.376
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

నక్కలవాగులో కొట్టుకుపోయి ఉద్యోగి మృతి


పవన్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: నక్కలవాగులో కొట్టుకుపోయి ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని మీర్జంపేట గ్రామ పరిధిలోని కొత్తపల్లిలో చోటుచేసుకుంది. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్(22) మీర్జంపేట గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు. వార్డుల విభజన సందర్భంగా ఆదివారం ఉద్యోగరీత్యా మీర్జంపేట గ్రామానికి వెళ్లి విధులు నిర్వహించి సాయంత్రం తన స్వగ్రామమైన కాల్వశ్రీరాంపూర్‌కు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తపల్లి శివారులోని నక్కలవాగు రోడ్డుపై పొంగి ప్రవహించడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంతో సహా పవన్ నీటిలో కొట్టుకుపోయాడు. పోలీసులు, కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన గ్రామస్తులు పవన్ కోసం వాగులో గాలింపులు చేపట్టారు.సంఘటన స్థలానికి వంద మీటర్ల దూరంలో పొదల్లో చికుకుని ఉన్న పవన్ మృతదేహాన్ని రాత్రి పది గంటల ప్రాంతాంలో స్థానికులు గుర్తించారు. చెప్యాల పవన్ తండ్రి చెప్యాల సదయ్య గ్రామ కార్యదర్శిగా పని చేసి అనారోగ్యంతో మృతి చెందడంతో నాలుగు సంవత్సరాల క్రితం పవన్‌కు మీర్జంపేట గ్రామంలో కారోబార్‌గా ఉద్యోగం వచ్చింది. పవన్ గల్లంత కావడంతో అతని తల్లి స్వరూపతో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కూనారం చెరువులో మత్స్యకారుడి గల్లంతు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం చెరువులో పడి మత్స్యకారుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతికల్ గ్రామానికి చెందిన గోస్కుల కుమార్(45) మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చేతి ధర్మయ్య వద్ద పని చేస్తున్నాడు. కునారం పెద్ద చెరువును చేతి ధర్మయ్య లీజుకు తీసుకొని చేపలు వేశాడు. ఆదివారం చేతి ధర్మయ్య దగ్గర పనిచేసే నలుగురు మత్స్యకారులు కునారం పెద్ద చెరువు మత్తడి వద్ద చేపలు బయటికి వెళ్లకుండా వలలు కడుతుండగా ప్రమాదవశాత్తు గోస్కుల కుమార్ చెరువులో పడి గల్లంతయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మానేరులో మత్స్య కార్మికుడు..

గంభీరావుపేట, సెప్టెంబరు 1: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు జలాశయంలో మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన శివరాములు అనే మత్స్య కార్మికుడు గల్లంతయ్యాడు. శివ రాములు ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. లచ్చపేట సమీపాన ప్రవహించే మానేరులోకి వచ్చే పాల్వంచ వాగులో శివరాములు చేపలు పట్టేందుకు వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు. లచ్చపేట వాగు వద్ద శివ రాములు దుస్తులు, పాదరక్షలు లభించడంతో చేపలు పట్టే క్రమంలో గల్లంతయ్యినట్టు గ్రామస్థులు భావిస్తున్నారు.

చెరువు నీటిలోకి వెళ్లి విద్యుత్ లైన్ల మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్

రామడుగు, సెప్టెంబరు 1: భారీ వర్షాలతో రామడుగు మండల కేంద్రానికి ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ నడుము లోతు నీళ్లలో నుంచి నడుచుకుంటూ వెళ్లి చెరువులో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి నుంచి రామడుగులో భారీ వర్షం కురుస్తోంది. గ్రామానికి వచ్చే విద్యుత్ లైన్‌కు సంబంధించిన కొన్ని స్తంభాలు చెరువు సమీపంలో ఉన్నాయి. భారీ వర్షాలకు ఆ స్తంభాల చుట్టూ చెరువు నీరు చేరింది. అందులో ఓ స్తంభం వద్ద లైన్ సాంకేతిక ఇబ్బంది ఏర్పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ భారీ వర్షం కురుస్తున్నా నడుములోతు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లి స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. దీంతో గ్రామానికి విద్యుత్ వచ్చింది. రంజిత్‌ను గ్రామస్థులు, అధికారులు అభినందించారు.

కూలిన రామడుగు బ్రిడ్జి


అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, సెప్టెంబరు 1: శిథిలావస్థకు చేరిన రామడుగు బ్రిడ్జి వరద ప్రవాహానికి ఆదివారం కూలిపోయింది.. స్థానిక అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు, ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాకపోకలను నియంత్రించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో అక్కడికి చేరుకుని బ్రిడ్జిని పరిశీలించారు.. నూతన బ్రిడ్జిలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందించి త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.. అప్పటివరకు రాకపోకలకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. బ్రిడ్జి తెగిపోయిన నేపథ్యంలో ఇటువైపు రావొద్దని ఎస్సై సురేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాలతో తిరుపతి రైలు రద్దు


వెలవెలబోతున్న కరీంనగర్‌రైల్వే స్టేషన్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 1: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలును అధికారులు రద్దు చేశారు. శనివారం రాత్రి తిరుపతి నుంచి కరీంనగర్ బయలుదేరిన రైలు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు విజయవాడ సమీపంలో నిలిపివేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరాల్సిన రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు రద్దుపై సరైన సమాచారం లేదని, రైల్వే అధికారులు నిర్లక్ష్యమైన సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అతి భారీ వర్షాల దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్‌లతో అతి భారీవర్షాల దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఎస్‌సీ అశోక్ కుమార్, ఇతరులు హాజరయ్యారు. ఈసందర్భంగా అధికారులకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి, జంతు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు: కలెక్టర్

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 2వ తేదీన జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం సహాయక చర్యలల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. ఈ కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు స్పష్టం చేశారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని హైదర్‌పల్లి గ్రామానికి చెందిన దారుకోట మల్లమ్మ అను మహిళకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదివారం ఎల్‌వోసీని అందజేశారు. మెదడు సంబందిత వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్సకు అవసరమైన రూ. 2.50 లక్షల సహాయాన్ని సీఎం సహాయ నిధి ద్వారా అందజేయడానికి జారీ చేసిన ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పంపిణీ చేశారు. హైద్రాబాద్‌లోని తన నివాసంలో జరిగిన ఓ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందించారు.



ఎల్‌వోసీని అందిస్తున్న ఎమ్మెల్యే

పద్మశాలి సంఘ పట్టణ అధ్యక్షుడిగా గుంటుక ప్రసాద్

కోరుట్ల, సెప్టెంబరు 1: పద్మశాలి సంక్షేమ సంఘ పట్టణ అధ్యక్షుడిగా గుంటుక ప్రసాద్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అందె శివప్రసాద్, శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని మార్కండేయ మందిరంలో ఎన్నికలు నిర్వహించారు. సంక్షేమ సంఘ అధ్యక్ష ఎన్నికల్లో గుడ్ల మనోహర్‌పై గుంటుక ప్రసాద్ గెలిపొందారు. యువజన సంఘం అధ్యక్షుడిగా జక్కుల ప్రవీణ్ కుమార్ గెలుపొందారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్, సెప్టెంబరు 1: మండల కేంద్రానికి చెందిన సీహెచ్ ముత్తయ్య అనే వ్యక్తికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రు. 1.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేసినట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం తెలిపారు. ముత్తయ్య తీవ్ర అనారోగ్యం బారిన పడగా అత్యవసర చికిత్స అవసరమని నిమ్స్ వైద్యులు తెలపడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సిఫార్సు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఎల్‌వోసీ మంజూరు చేశారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మెట్‌పల్లి, సెప్టెంబర్ 1(ఇబ్రహీంపట్నం): చిన్ననాటి స్నేహితులు 54 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 1970-71 బ్యాచ్‌కు పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చదువుకున్న సమయంలో అనుభవాలను గుర్తుచేసుకున్నారు. అధ్యాపక బృందాన్ని పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్ రాజేశ్వర్‌గౌడ్, గంగాధర్, రాజమల్లయ్య, వినోద్‌రావు, ప్రభాకర్‌రావు, అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో 'మన ఊరు-మన బాధ్యత'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్థులు

రాయికల్, సెప్టెంబరు 1: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు మన ఊరు-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పురవీధుల గుండా తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, తాజా మాజీ వైస్ ఎంపీపీ యాచమనేని మహేశ్వర్ రావు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సంకోజి మహేష్, నూకల గంగాధర్, మోతె అంజయ్య, పీడీ కోల రాజగోపాల్, గుర్రం నారాయణ, టీవీ గోపాల్, సుధాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

రాయికల్, సెప్టెంబరు 1: హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గురుభ్యోనమః కార్యక్రమంలో రాయికల్ బాలుర ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చెరుకు మహేశ్వర శర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మోహన్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షం: ప్రజలకు ఇక్కట్లు

ధర్మపురి, సెప్టెంబరు 1: ధర్మపురి మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని అనేక గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండిపోయాయి. రోడ్లు జలమయం కావటం వల్ల అనేక చోట్ల దెబ్బతిని ప్రజలకు నష్టం వాటిల్లింది. రైతులు, వ్యవసాయ కూలీలు పనులు చేసేందుకు బయటకు రాలేదు. బట్టుపెల్లి, నేరెళ్ల గుట్టల వద్ద నుంచి వచ్చిన వరద నీరు అక్కపెల్లి చెరువులో చేరింది. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వరద పరిస్థితి గురించి ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహేష్, సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. మండలంలోని అనేక గ్రామాల్లో పంట చేనుల్లో నీరు చేరి, రోడ్లు జలమయం అయ్యాయి. ఆకుసాయిపల్లె ఆంజనేయస్వామి ఆలయం చుట్టు నీరు చేరింది. భారీ వర్షాలకు వేలాది ఎకరాల భూములకు నీరందించే అక్కపెల్లి చెరువులోకి భారీగా వరద నీరు చేరుతోంది. మండలంలో 63.0 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. తహసీల్దార్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- జగిత్యాలలో ఉద్యోగ సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ సభ్యులు

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జగిత్యాలలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు ప్రధాన వీదుల్లో ఫ్లెక్సీ బ్యానర్, ప్లకార్డులతో ప్రదర్శన జరిపారు. జిల్లా కేంద్రంలోని మిని స్టేడియం నుంచి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా జరిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి నిరసనగా సెప్టెంబరు ఒకటవ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు.

● ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సంఘీభావం...

జగిత్యాలలో ఉపాధ్యాయ, ఉద్యోగులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల న్యాయ మైన డిమాండ్‌ను నెరవేరాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ నాయకులు బోగ శశిధర్, గంగుల సంతోష్ కుమార్, మామిడి రమేశ్, మిర్యాల నాగేందర్ రెడ్డి, ట్రెసా అధ్యక్షుడు వకీలు, టీజీఓ నాయకులు కందుకూరి రవిబాబు, గణేష్, రాజేందర్, హరి అశోక్ కుమార్, మహేశ్, సతీస్, పవన్, రవీందర్, మధుకర్, శ్రీనివాస్, అమర్‌నాథ్ రెడ్డి, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

● తపస్ ఆధ్వర్యంలో నిరసన...

పట్టణంలోని తపస్ సంఘ కార్యాలయం వద్ద ఆదివారం తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్ రావు, అయిల్నేని నరేందర్‌రావు, వొడ్నాల రాజశేఖర్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): సీపీఎస్‌ను రద్దు చేసి వెంటనే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తీరుకోవెల శ్యామ్ సుందర్, గాదె నర్సింగరావు, షేక్ తాహేర్, కల్లూరి నరేష్, రాజేందర్, రాజు, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువసేన యూత్ అధ్యక్షుడిగా రాజేష్

రాయికల్, సెప్టెంబరు 1: రాయికల్ పట్టణంలోని అంబేద్కర్ యువసేన యూత్ అధ్యక్షునిగా మారంపెల్లి రాజేష్ ఆదివారం ఎన్నికయ్యాడు. నూతన కార్యవర్గ కమిటీని సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా లింగంపెల్లి వేణు, ప్రధాన కార్యదర్శిగా పాలెపు నాగరాజు, కార్యదర్శిగా బట్టు ప్రవీణ్, కోశాధికారిగా నిగ స్వామిని ఎన్నుకున్నారు.

భాషోపాధ్యాయులకు సమాన అవకాశం కల్పించాలి

రాయికల్, సెప్టెంబరు 1: జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానంలో తెలుగు, హిందీ, ఉర్దూ భాషోపాధ్యాయులకు సమాన అవకాశం కల్పించాలని ఆర్‌యూపీపీటీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల స్వామి యాదవ్ అన్నారు. ప్రతీ సంవత్సరం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానంలో తెలుగు, హిందీ, ఉర్దూ భాషోపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రతీసారి ఇతర సబ్జెక్టుల వారికంటే ఎస్‌జీటీలకంటే భాషోపాధ్యాయులకు తక్కువ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. దీనివలన ప్రతిభ కలిగిన భాషోపాధ్యాయులు నిరుత్సాహానికి గురవుతున్నారని అన్నారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారికి మెయిల్ ద్వారా వినతి పత్రం పంపినట్లు పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం భక్తులు అన్నదానం నిర్వహించారు. అంతక ముందు ఆలయంలో పూజారి భాస్కర్ హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హన్మాన్ సేవా సమితి సభ్యులు జక్కుల మల్లేశం, ఇట్టె గంగాధర్, గణేష్, శంకరాచారి, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మెగా ఇంపాక్ట్ పోస్టర్ ఆవిష్కరణ

కొడిమ్యాల, సెప్టెంబరు 1: మండల కేంద్రంలో, మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో ఆదివారం మెగా ఇంపాక్ట్ శిక్షణ కార్యక్రమ పోస్టర్‌ను ఇంపాక్ట్ సభ్యులు ఆవిష్కరించారు.

ఇంపాక్ట్ అధ్యక్షుడు బొమ్మ సురేష్, క్లబ్ ట్రైనర్ టి. పూర్ణచందర్ మాట్లాడుతూ ఈ నెల 3, 4లలో వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమంలో కరీంనగర్‌లోని వి. కన్వెన్షన్ హాల్‌లో ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేడు యువత ఎదుర్కొంటున్న సమస్యల నుండి బయట పడుటకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మడల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి ఐ సత్యానందం, రాజయ్య, శంకర్, అరవింద్ కిరణ్, ప్రసాద్, శ్రీనివాస్ గ్రామస్థులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

- మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 1: దేశంలోని సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో అహల్యాబాయ్ హోల్కర్ జయంతి ఉత్సవాలు ఆదివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విద్యాసాగర్‌రావు హాజరయ్యారు. ముందుగా సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమరసత సమ్మేళన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం భారత రాజ్యాంగంలో సోదర భావం అనే పదాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పునాది వేశారని పేర్కొన్నారు. దేశంలో భిన్న కులాలు ఉన్నప్పటికి హిందూ సమాజం ఏకతాటిపై నడవాలని, మనంతా ఒకే కుటుంబానికి చెందిన వారమని భావించాలన్నారు. ఆది శంకరాచార్యుల నుంచి నేటి వరకు సమరసత సమాజాన్ని నిర్మాణం చేయటంలో ఎందరో మహానుభావుల కృషి ఉందన్నారు. అనంతరం సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ పూర్వం మన దేశంలో ఎటువంటి భేదం ఉండేది కాదని మొగలులు, బ్రిటిష్ వారు వచ్చిన తర్వాతనే సమాజంలో అంతరాలు పెరిగి అంటరానితనం ఏర్పడిందన్నారు. భారతదేశం ప్రపంచంలో ఉన్నతంగా నిలవడానికి కుటుంబ వ్యవస్థనే మూలమని, ఆ కుటుంబానికి మహిళలే ఆధారమని తన పిల్లలకి కుటుంబ విలువలు నేర్పాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, మహిళ కన్వీనర్ కరెడ్ల రుక్మిణి, బెజ్జారపు మురళి, పోహార్ తుకారం, ఓగులపు శేఖర్, మంతె రాజేందర్, ముత్యాల వెంకట్‌రెడ్డి, మర్రి భాస్కర్, రాంపల్లి రఘుపతి, జోగ రాజగంగారాం, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కడ లేని విధంగా మెట్‌పల్లి పట్టణంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు మహారాష్ట్ర మాజీ గవర్నర్, మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ పార్క్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, నాయకులు చెట్లపల్లి సుఖేంధర్ గౌడ్, నరేంధర్‌రెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్, కృష్ణమాచారి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

● పట్టణానికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పరమర్శించారు. ఆయన వెంట బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ఆర్మూర్ రంజిత్, నాయకులు ఉన్నారు.

బురదమయంగా మారిన ప్రధాన రోడ్లు

- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

కొడిమ్యాల, సెప్టెంబరు 1: కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై ఉన్న బ్రిడ్జి వద్ద నాచుపల్లి వైపు రోడ్డు రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం మధ్య ప్రధాన రోడ్డుపె గుంతలు ఏర్పడి నీరు నిలిచింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకున్న భక్తులు, మండలంలోని నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వస్తారు. అనంతరం జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి పక్కన ఉన్న బురద రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ రోడ్డు బురదమయం కావడంతో ఈ దారిగుండా వెళ్లడం కష్టంగా మారిందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు నిత్యం వ్యవసాయ పనులకు ఇతర గ్రామాలకు, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటె ఇదే రోడ్డుపై వచ్చి పోతుంటారు. నల్లగొండ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలో నీరు నిల్వ ఉండటంతో ఆప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు.



కొడిమ్యాల-నాచుపల్లి మధ్య బురదమయంగా మారిన రోడ్డు

సంబంధిత అధికారులు బ్రిడ్జి పక్కన రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాలని, నల్లగొండ, చెప్యాల రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, సీనియర్ లెక్చరర్ జైశెట్టి రమణయ్య సతీమణి జైశెట్టి వరలక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాదిత కుటుంబ సభ్యులను ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ పరమార్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గదాపు రాజేందర్, భానుప్రియ, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

మల్యాల, సెప్టెంబరు 1: మండలంలోని ముత్యంపేటకు చెందిన సింగిరెడ్డి వంశీధర్‌రెడ్డిని స్థానిక గుడేటి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మించారు. ఇటీవల వంశీధర్ రెడ్డి మిషన్‌భగీరథ ఏఈఈగా ఉద్యోగం సాధించడంతో శాలువలతో సత్కరించి మరింత ఉన్నతంగా ఎదగాలని అభిలాషించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సంత ప్రకాష్ రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, నేరెల్ల లింగారెడ్డి, సామ మహిపాల్‌రెడ్డి, కొమ్ముల సుదర్శన్‌రెడ్డి, సంత శ్రీధర్‌రెడ్డి, స్వామిరెడ్డి, ముత్యంరెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

రెడ్డిసంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 1: జిల్లా రెడ్డి సంఘం ఎన్నికలు ఆదివారం జగిత్యాల మండలం ధరూర్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొప్పెర వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సింగాపూర్‌కు చెందిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు మహిపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి ప్రకటించారు.

సామూహిక వనభోజనాలు

మెట్‌పల్లి, సెప్టెంబరు 1(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని ఐదు చేతుల పోచమ్మ ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక వనభోజనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి సామూహిక వనభోజనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపుగా 1500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్మి రవి, కోశాధికారి దొంతుల లక్ష్మీనారయణ, నాయకులు నవీన్, సురేష్, కిరణ్, లవకుమార్ ఉన్నారు.

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 1: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ పభుత్వం కృషి చేస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కోరుట్ల మార్కెట్ కమిటి పాలకవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే వివేక్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలకులు కుటుంబ పాలన నిర్వహించి ప్రజల పొట్టకొట్టి వారి ఖజానాను నింపుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలోకి గత బీఆర్ఎస్ ప్రభుత్తం నెట్టివేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు న్యాయం జరిగేలా గోదాముల, వరిధ్యానం రవాణకు లారీల సౌకర్యాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. మార్కెట్ కార్యదర్శి ప్రశాంత్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, వైస్‌చైర్మన్ పుల్లూరి వెంకటేష్‌తో పాటు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. జువ్వాడి నర్సింగారావు, ఎమ్మెల్యే వివేక్‌ను మార్కెట్ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పల్లెపు రాజు, బొల్లే నర్సయ్య, పడాల కవిత-లచ్చయ్య, పోతుగంటి వెంకాగౌడ్, జక్కుల రాజం, ఎనుగు బల్వంత రెడ్డి, శ్రీరాంల అమరేంధర్, జగనాథ్ లక్ష్మణ్, మహ్మద్ అయూబ్, అల్లాడి శ్రీనివాస్, అబ్బుల్ వాజీద్, నాయకులు అన్నం అనిల్ కుమార్, తిరుమల గంగాధర్, కొంత రాజం, మ్యాకల నర్సయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే వివేక్‌కు పట్టణంలోని సాయిబాబ దేవాలయం వద్ద ఘన స్వాగతం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.



మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం



అలూరు-అయోధ్య గ్రామాల మధ్య రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో ట్రాక్టర్ ద్వారా కూలీల తరలింపు



మల్యాల-పెగడపల్లి మార్గంలో కోతకు గురి అయిన రహదారి



మల్యాల శివారులో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



పెగడపల్లిలో ఇంట్లోకి చేరిన వరద నీరు